సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం । 3 । నవంబర్ । 2023



విద్యార్థుల సామర్థ్యమెంత..?
సీస్ సర్వే నేటి నుంచి ప్రారంభం కానుంది. 3, 6, 9 తరగతుల విద్యార్థులను పరీక్షిస్తారు.
- 4లో



ఇంటర్ పరీక్ష ఫీజులకు..
ఇంటర్ పరీక్ష ఫీజుల షెడ్యూల్ వెలువడింది. 30వ తేదీ వరకు గడువు ఉంది.
- 4లో

5న పలాసలో బస్సుయాత్ర
కాశీబుగ్గ: పలాసలో ఈ నెల 5న సామాజిక సాధికార యాత్ర నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పశుసంవర్ధక పాడి పరిశ్రమల మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు క్యాంప్ కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదలైంది. క్యాబినెట్ సమావేశం కారణంగా 3న జరగాల్సిన యాత్రను 5వ తేదీకి వాయిదా వేసినట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

అండర్-19 టేబుల్ టెన్నిస్ క్రీడాకారుల ఎంపిక
ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడల్లో పాల్గొనే అండర్-19 టెన్నిస్ క్రీడాకారుల ఎంపిక శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ, దుప్పలవలస అంబేడ్కర్ గురుకుల పాఠశాల పీడీ ఎస్.రమణ తెలిపారు. పాఠశాలలో గురువారం వివరాలు వెల్లడించారు. దుప్పలవలస గురుకుల క్రీడా మైదానంలో మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల క్రీడాకారులు ఫోన్ నంబర్ 6302546128ను సంప్రదించాలని తెలిపారు.

5న రిటైర్డ్ ఉద్యోగుల సర్వసభ్య సమావేశం
శ్రీకాకుళం కల్చరల్: రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సర్వసభ్య సమావేశం ఈనెల 5న శాంతాకల్యాణ్ అనురాగ నిలయంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు అధ్యక్షులు ఎంఎస్ఆర్ఎస్ ప్రకాశరావు, కార్యదర్శి పి.నరసింహమూర్తి, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.సోమ సుందర రావులు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని మండల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు సమావేశానికి హాజరు కావాలని కోరారు.

పోషకాల యాజమాన్యం కీలకం


మాట్లాడుతున్న ఆత్మ పీడీ రామచంద్రరావు

గార: పంటలకు పోషకాల యాజమాన్యం కీలకమని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ సి.రామచంద్రరావు అన్నారు. శాలిహుండంలో గురువారం ఆత్మ సౌజన్యంతో కలుపు, పోషకాలు, నీటి యాజమాన్యం అవగాహన సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ రైతులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అవసరమైన పోషకాలు లేకుండా అవసరం లేనివి వాడటం వల్ల ప్రయోజనం ఉండదన్నారు. కలుపు యాజమాన్యంపై వరి పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ పి.అమరజ్యోతి రైతులకు అవగాహన కల్పించారు. సరైన సమయంలో పంటకు నీరు అవసరమని, పాలుపోసుకున్న దశలో నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. రబీలో అనువైన రకాలపై, నువ్వుల పంట యాజమాన్యంపై కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త నీలవేణి వివరించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వై.సూర్యకుమారి, డాక్టర్ ముధుకర్, ఏడీఏ బగ్గు రజిని, వ్యవసాయాధికారి దుంపల పద్మావతి, జల్లు గౌరపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు పక్కాగా అమలు కావాలి


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రభుత్వ పథకాలు పక్కాగా అమలు కావాలని బీసీ కార్పొరేషన్ ఈడీ ఆర్.గడ్డెమ్మ అన్నారు. పొన్నాడ గ్రామ సచివాలయం-1ను గురువారం గడ్డెమ్మ పరిశీలించారు. ప్రభుత్వ పథకాల అమలుపై సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ పింఛన్ కానుక వంటి పథకాల అమలుపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వలంటీర్లు తమ పరిధిలో 50 ఇళ్లలో అర్హులను గుర్తించి పథకాలు అమలు చేయాలని తెలిపారు.

5న జిల్లా సబ్‌జూనియర్స్ ఖోఖో జట్ల ఎంపిక
శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా సబ్-జూనియర్స్ బాలబాలికల ఖోఖో జట్ల ఎంపికలు ఈనెల 5వ తేదీన జరగనున్నాయని జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షులు చిట్టి నాగభూషణం, సీహెచ్ ఫల్గుణరావు తెలిపారు. శ్రీకాకుళం కోడి రామ్మూర్తి స్టేడియం ప్రాంగణం వేదికగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ఈ ఎంపికల ప్రక్రియ మొదలుకానున్నట్లు చెప్పారు. ఈ ఎంపికల్లో పాల్గొనే బాలబాలికలు 2010 జనవరి ఒకటి తర్వాత జన్మించి ఉండాలని, అలాగే ఎత్తు, బరువు, వయస్సు కలిగి 215 పాయింట్లు మించకూడదని స్పష్టంచేశారు. ఇక్కడ ఎంపిక చేసిన జిల్లా జట్లను ఈనెల 26 నుంచి పల్నాడు జిల్లా నరసారావుపేట వేదికగా జరిగే ఏపీ రాష్ట్రస్థాయి సబ్-జూనియర్స్ బాలబాలికల ఖోఖో చాంపియన్‌షిప్ పోటీలకు పంపించనున్నట్టు వారు పేర్కొన్నారు.

దారులు విశాలం.. ఊరికి కుశలం



పునర్నిర్మాణం జరగనున్న సోంపేట మండలం ఎకువూరు-ఎస్‌హెచ్-5 రోడ్డు



బీటీ రోడ్డుగా మారనున్న రణస్థలం మండలం వెంకట్రావ్‌పేట కూడలి నుంచి రావాడ రహదారి

- జిల్లాలో ఏడు చోట్ల హై ఇంపాక్ట్ రోడ్ల నిర్మాణానికి చర్యలు
- రద్దీగా ఉండే గ్రామీణ రహదారులను గుర్తించిన పంచాయతీ రాజ్ శాఖ
- 3 నియోజకవర్గాల్లో రూ.11.72 కోట్లతో రహదారుల నిర్మాణం
- పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ పర్యవేక్షణలో ప్రారంభం కానున్న పనులు

అరసవల్లి: పల్లె దారులు మారనున్నాయి. ముఖ్యమైన గ్రామీణ రహదారులను పూర్తిస్థాయి విస్తరణతో తారు రోడ్లుగా మార్చేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. దీని కోసం పంచాయతీ రాజ్ ఉన్నతాధికారులు టెండర్ల ప్రక్రియకు కూడా శ్రీకారం చుడుతున్నారు. బిడ్లను ఆన్‌లైన్ ద్వారా ఆహ్వానించనున్నారు. జిల్లాలోని ఇచ్ఛాపురం, పాతపట్నం, ఎచ్చెర్ల తదితర నియోజకవర్గాల్లో ప్రధానంగా రద్దీగా ఉండే రహదారులను పూర్తి స్థాయి నాణ్యతతో పాటు రద్దీకి అనుగుణంగా విస్తరించి పునర్నిర్మించనున్నారు. మొత్తం ఏడు రహదారులను గుర్తించిన పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు రూ.11.72 కోట్లతో పునర్నిర్మాణం చేసేందుకు టెండర్ల ప్రక్రియ మొదలుపెట్టారు. ఆయా ప్రాంతాల్లో ప్రయాణికులకు, వాహన చోదకులకు కూడా ఇరుకు రహదారుల కష్టాలు తప్పనున్నాయి.

రద్దీ రహదారుల గుర్తింపు

గ్రామీణ ప్రాంతాల్లో ఒకప్పటి పరిస్థితులు లేవు. వాహనాల సంఖ్య విపరీతంగా పెరగడంతో చాలా రోడ్లు ఇరుకైపోయాయి. జాతీయ, రాష్ట్ర హోదాల్లో ఉన్న ప్రధాన రహదారుల్లో ఉన్నట్లే జిల్లాలో పలు గ్రామీణ రహదారుల్లో ఈ మధ్య కాలంలో వాహనాల రద్దీ పెరిగినట్లుగా అధికారులు గుర్తించారు. అలాగే ముఖ్య ప్రదేశాలకు, మండల కేంద్రాలకు తరచుగా రాకపోకలు సాగించే క్రమంలో కూడా పలు రహదారులు రద్దీగా మారుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సాంకేతికత సహాయంతో గూగుల్ మ్యాప్‌ల ద్వారా సరిగ్గా ఇలాంటి 258 రహదారులను హై ఇంపాక్ట్ రోడ్లుగా గుర్తించి, వెంటనే ఈ రహదారుల్లో ప్రయాణాలను మరింత సౌకర్యవంతంగా నాణ్యతగా పునర్నిర్మాణం చేసేలా అడుగులు వేస్తోంది. అవసరమైన చోట వంతెనలు, మట్టి రోడ్ల స్థానే తారు రోడ్లు వేసేలా ప్రణాళికలు వేసి టెండర్ల ప్రక్రియ పూర్తి కాగానే పనులు ప్రారంభించనున్నారు.

వచ్చేనెల నుంచి పనులు ప్రారంభం


జిల్లాలో హై ఇంపాక్ట్ రోడ్లుగా మొత్తం ఏడింటిని గుర్తించి రూ.11.72 కోట్లతో పునర్నిర్మాణ పనులు చేసేందుకు నిర్ణయించారు. రద్దీగా ఉండే గ్రామీణ రహదారులను గుర్తించి టెండర్లు పిలవనున్నారు. ఈనెల 6 నుంచి ఆన్‌లైన్‌లో బిడ్లు వేసేలా ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేశారు. 14 రోజుల పాటు గడువు ముగియగానే.. టెండర్లు ఖరారు చేసిన అనంతరం వచ్చే నెల మొదటి వారం నుంచే పనులు ప్రారంభించేలా చర్యలు చేపడతాం.

– బీఎస్ఎస్.మూర్తి, ఎస్ఈ, పంచాయతీరాజ్

జిల్లాలోని హైఇంపాక్ట్ రహదారులివే..

- ఇచ్ఛాపురం నియోజకవర్గం: సోంపేట మండలం పాత జాతీయ రహదారి (ఎస్‌హెచ్-5) నుంచి ఎకువూరు (వయా బట్టిగొల్లూరు)- 4.60 కిలోమీటర్లు- రూ.2 కోట్లు.
- పాతపట్నం నియోజకవర్గం: మెళియాపుట్టి మండలం ఎంఎం రోడ్డు నుంచి పెద్ద లక్ష్మీపురం - 1.30 కిలోమీటర్లు - రూ.32.50 లక్షలు.
- ఎచ్చెర్ల నియోజకవర్గం: లావేరు మండలం వెంకటాపురం నుంచి అదపాక (వయా గోవిందపురం)- 6.50 కిలోమీటర్లు- రూ.3.12 కోట్లు.
- జి.సిగడాం మండలం గంగన్నదొరపాలెం నుంచి దేవరవలస- 2.40 కిలోమీటర్లు - రూ.1.35 కోట్లు.
- జి.సిగడాం మండలం పొగిరి కూడలి నుంచి పెంట గ్రామం - 2.32 కిలోమీటర్లు - రూ.1.30 కోట్లు.
- జి.సిగడాం మండలం జగన్నాథవలస నుంచి కొయ్యాన పేట - 1.85 కిలోమీటర్లు - రూ.1.13 కోట్లు.
- రణస్థలం మండలం వెంకట్రావ్‌పేట కూడలి నుంచి రావాడ (వయా ఉప్పివలస) - 4.10 కిలోమీటర్లు - రూ.2.50 కోట్లు.



● కిడ్నీ రీసెర్చ్ సెంటర్ లోగో విడుదల


ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కిడ్నీ రీసెర్చ్‌సెంటర్, 200 పడకల ఆస్పత్రి, డయాలసిస్ సెంటర్ మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఆస్పత్రి యాజమాన్యం లోగోను తయారు చేసి ఆస్పత్రి వద్ద ప్రదర్శించింది. రెండు కిడ్నీలను రెండు చేతులతో రక్షిస్తూ ఉండటంతో పాటు మధ్యలో వైద్యానికి సంబంధించిన గుర్తు, పచ్చని ఉద్దానం ప్రాంతానికి గుర్తుగా ఆకులు, వాటి మధ్యలో పలాస, లోకాసమస్తా సుఖినోభవంతు అంటూ అద్భుతమైన లోగోను విడుదల చేశారు. – కాశీబుగ్గ

● గంగమ్మ కోసం..


మండలంలోని కె.కపాసుకుద్దిలో గురువారం శ్రీరామలింగేశ్వరస్వామికి వర్షాల కోసం భక్తులు సహస్ర ఘటాభిషేకాన్ని నిర్వహించారు. సీహెచ్‌కపాసుకుద్ది, కె కపాసుకుద్ధి, ప్రగడపుట్టుగ, ముత్యాలపేట, కొరికానపుట్టుగ తదితర గ్రామాలకు చెందిన సుమారు 2000 మంది భక్తులు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. – కవిటి

డిసెంబర్ రెండో శనివారం జాతీయ లోక్ అదాలత్


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: డిసెంబర్ నెల రెండో శనివారం తొమ్మిదో తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. ఈ అదాలత్‌లు జిల్లా కేంద్రంతో పాటుగా ఆమదాలవలస, కోటబొమ్మాళి, నరసన్నపేట, పాలకొండ, పలాస, రాజాం, పాతపట్నం, సోంపేట, టెక్కలి, ఇచ్ఛాపురం, కొత్తూరు, పొందూరు కోర్టుల్లో నిర్వహిస్తామని పేర్కొన్నారు. రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు అన్ని రకాల సివిల్ కేసులు, బ్యాంకు కేసులు, మోటార్ ప్రమాద కేసు, ప్రి లిటిగేషన్ కేసులు రాజీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ ఆర్.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

పురుషోత్తపురం చెక్‌పోస్టుపై ఏసీబీ దాడి


ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో చెక్‌పోస్టులో సోదాలు చేస్తున్న ఏసీబీ బృందం

ఇచ్ఛాపురం: ఆంధ్రా-ఒడిశా సరిహద్దులోని పురుషోత్తపురం ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు వద్ద గల మోటార్ వెహికల్ కార్యాలయంపై అవినీతి నిరోధక శాఖ అధికారులు గురువారం ఆకస్మికంగా దాడి చేశారు. ఈ దాడిలో రూ.1.30 లక్షల సొమ్ము అనధికారికంగా ఉన్నట్లు గుర్తించారు. వివరాల్లోకి వెళ్లగా.. స్థానిక చెక్‌పోస్టులోని ఎంవీఐ సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారని వచ్చిన ఫిర్యాదుల మేరకు శ్రీకాకుళం, విజయనగరం ఏసీబీ సిబ్బంది ఏసీబీ డీఎస్పీ బీవీఎస్ఎస్ రమణమూర్తి నేతృత్వంలో దాడులకు సిద్ధమయ్యారు. ఐదుగురు సీఐలు, ఇద్దరు ఎస్ఐలు, సిబ్బందితో బుధవారం అర్ధరాత్రి దాటాక 1.30 గంటలకు దాడులు చేశారు. దీనిపై ఏసీబీ డీఎస్పీ మాట్లాడుతూ ఈ దాడుల్లో ఎంవీఐ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు సిబ్బంది ఏఎంవీఐ అనిల్‌కుమార్, ఇద్దరు కానిస్టేబుళ్లు రమణ, ఈశ్వరరావుల వద్ద నుంచి రూ.లక్షా30వేల అనధికార సొమ్మును గుర్తించామన్నారు. జూలై నుంచి రాష్ట్రంలోని అన్ని చెక్‌పోస్టుల్లో ప్రభుత్వం నగదు రహిత లావాదేవీలు ప్రారంభించిందని, అయినా ఇక్కడ సిబ్బంది అనధికార వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు తమకు వచ్చాయన్నారు. ఈ దాడుల్లో దొరికిన సొమ్మును సీజ్ చేసి నివేదికను తయారు చేసి ఏసీబీ ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించనున్నారు.

ఈ ఏడాది జూలై నెలలో ఇదే చెక్‌పోస్టుపై ఏసీబీ సిబ్బంది అకస్మికంగా దాడి చేసి రూ.2.20 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. తాజా దాడుల్లో సీఐలు రమణ, హరి, మహేశ్వరరావు, శ్రీనివాసరావు, వెంకటరమణ, ఎస్ఐలు ఇస్మాయిల్, వాసు నారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

పులి అలజడి


బెంకిలిలో పులి పాదముద్ర

సోంపేట: కంచిలి, సోంపేట మండలవాసులను పులి భయపెడుతోంది. తాజాగా గురువారం సోంపేట మండలం బెంకిలి గ్రామంలో అలజడి సృష్టించింది. బారువ, పలాస ఎఫ్ఎస్ఓలు వై.రాజేంద్ర,బీబీ రెడ్డి బెంకిలి గ్రామంలో పర్యటించి పులి అడుగులు నిర్ధారించుకుని ప్రజలను అప్రమత్తం చేశారు. బెంకిలి గ్రామానికి చెందిన తామాడ గణేష్ బుధవారం రాత్రి 7 గంటల సమయంలో పొలానికి నీరు పెట్టడానికి బైక్‌పై వెళ్తే పులి కనిపించిందని చెప్పాడు. పులి కనిపించిన వెంటనే పక్కన చెట్టు ఎక్కి అక్కడి నుంచే తల్లిదండ్రులకు ఫోన్ చేశాడు. తొలుత దీన్ని ఎవరూ నమ్మలేదు. అయితే అటవీ శాఖాధికారులు గణేష్ చెప్పిన స్థలం వద్దకు వెళ్లి చూస్తే పులి అడుగులు కనిపించాయి. దీంతో అక్కడి ప్రజలను అప్రమత్తం చేశారు. బెంకిలి పరిసర గ్రామాల్లోని ప్రజలు సాయంత్రం 5 నుంచి ఉదయం 6 గంటల వరకు బయటకు రావద్దని, పశువులను సురక్షిత ప్రాంతాల్లో ఉంచుకోవాలని సూచించారు.

కర్తలిపాలెంలో..

కర్తలిపాలెంలో బుధవారం రాత్రి గ్రామానికి చెందిన బి.రామస్వామి అనే రైతుకు చెందిన ఆవును పులి చంపేసింది. గురువారం ఉదయం తోటకు వెళ్లిన రైతుకు ఆవు కళేబరం కనిపించడంతో అధికారులకు విషయం చెప్పారు. వారు వచ్చి పులి దాడిలో ఆవు మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ రెండు ఘటనలతో నియోజకవర్గ ప్రజలు భయపడుతున్నారు. పొలాలకు నీరు పెట్టేందుకు ఎక్కువ మంది రైతులు వెళ్తున్నారని, పులి భయం వద్ద నీరు పెట్టడం వీలు కావడం లేదని చెబుతున్నారు. బారువ, పలాస ఎఫ్ఎస్ఓలు వై.రాజేంద్ర, బీబీ రెడ్డి మాట్లాడుతూ బుధవారం రాత్రి కంచిలి మండలం మండపల్లి వద్ద నుంచి బయల్దేరిన పులి సోంపేట మండలం బెంకిలి గ్రామం మీదుగా కర్తలిపాలెం వరకు చేరుకున్నట్లు ప్రస్తుతం గుర్తించామన్నారు. శుక్రవారం ఉదయానికి పూర్తి నిర్ధారణ జరుగుతుందన్నారు.

కంచిలి: ఉద్దానం గ్రామాల్లో పులిసంచారంపై ఆందోళన కొనసాగుతోంది. మండపల్లి, తలతంపర, కుత్తుమ పంచాయతీ ప్రజలకు కేటాయించిన జగనన్న కాలనీ స్థలం కొండ ప్రాంతం నుంచి కవిటి-సోంపేట మెయిన్‌రోడ్డు మీదుగా పులి రోడ్డు క్రాస్ చేస్తూ ఉండగా తాము చూశామని బొరివంక గ్రామంలో గల ఏపీజీబీవీ బ్యాంకు సిబ్బంది గౌతమ్, సాయి చెబుతున్నారు. మొబైల్‌లో ఫొటోలు కూడా తీశారు. అదే సమయంలో సోంపేట మండలం బెంకిలి గ్రామంలో పంట పొలాల్లో పెద్ద పులిని చూసినట్లు ఓ యువకుడు చెప్పారు. ఈ విభిన్న కథనాలతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అటవీ శాఖాధికారులే జనం అయోమయాలను తొలగించాలని కోరుతున్నారు.



కర్తలిపాలేంలో ఆవు మృతదేహం వద్ద అటవీశాఖాధికారులు

ఎస్పీ ఆకస్మిక తనిఖీ


స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక

నరసన్నపేట: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ జీఆర్ రాధిక గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉదయం 11 గంటల సమయంలో ఆమె హఠాత్తుగా స్టేషన్‌లో కనిపించడంతో సిబ్బంది హైరానా పడ్డారు. ఆ సమయానికి స్టేషన్‌లో ఎస్ఐ లేరు. ఎక్కడికి వెళ్లారని స్టేషన్‌లో ఉన్న మహిళా కానిస్టేబుల్స్‌ను ఎస్పీ ప్రశ్నించారు. రైటర్ స్థానంలో ఉన్న ఏఎస్ఐ అసిరినాయుడు నుంచి ఫైల్స్ తెప్పించుకొని పరిశీలించారు. అప్పటికి సీఐ బి.ప్రసాదరావు స్టేషన్‌కు చేరుకున్నారు. అక్టోబర్ నెలలో క్రైమ్ రేట్, కేసుల నమోదు గురించి అడిగి తెలుసుకున్నారు. నవ్య కేసులో విచారణ ఎలా అవుతుంది, అరెస్టులు పూర్తయ్యాయా అని సీఐని అడిగారు. కొత్తగా అరెస్టులు చేయడానికి ఇంకా ఎవరిపైనా ఆధారాలు లభించలేదని సీఐ వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసులు త్వరిత గతిన విచారణ చేపట్టాలని ఆదేశించారు. ఎస్ఐ వై. సింహాచలం పనితీరుపై ఆరా తీశారు.

'గరిమెళ్ల'కు కుటుంబసభ్యుల నివాళి


గరిమెళ్ల ప్రభుత్వ కళాశాలలో ఆయన విగ్రహానికి నివాళి అర్పించిన గరిమెళ్ల కుటుంబసభ్యులు

పోలాకి: జాతీయోద్యమ నాయకుడు, ప్రసిద్ధ కవి గరిమెళ్ల సత్యనారాయణకు ఆయన కుటుంబ సభ్యులు స్వగ్రామం ప్రియాగ్రహారంలో గురువారం ఘనంగా నివాళులర్పించారు. గరిమెళ్ల మేనల్లుడు డాక్టర్ ఈవీఆర్ రావు, మనవడు వై.లక్ష్మణరావులు గరిమెళ్ల విహార్‌తో పాటు గరిమెళ్ల పేరిట ఉన్న పాఠశాల, కళాశాలను సందర్శించారు. అక్కడ ఉన్న గరిమెళ్ల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నాడు-నేడు ద్వారా గరిమెళ్ల పాఠశాలను అభివృద్ధి చేస్తున్న తీరుపై వారు హర్షం వ్యక్తం చేశారు. గరిమెళ్ల విజ్ఞాన వేదిక అధ్యక్షుడు వీజీకే మూర్తి మాట్లాడుతూ జాతి మరచిన జాతిరత్నం గరిమెళ్ల అని కొనియాడారు. గరిమెళ్ల ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి బాడాన రాజు మాట్లాడుతూ త్వరలో తపాలా శాఖ సౌజన్యంతో గరిమెళ్ల పేరిట తపాలా ముద్రిక విడుదల చేయనున్నట్లు ప్రకటించారు.

'ఐటీఈపీ డిగ్రీ కోర్సు సద్వినియోగం చేసుకోండి'


ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రొగ్రాంను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు తెలిపారు. వర్సిటీ పరిపాలన భవనంలో గురువారం ఆయన మాట్లాడారు. ఈ నెల 13 దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీగా చెప్పారు. ఎన్‌సీఈటీ-2023 పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు అర్హులని తెలిపారు. టెస్ట్ స్కోర్, రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా ప్రవేశాలు ఉంటాయని అన్నారు. ఈ ఏడాది దేశ వ్యాప్తంగా ఈ కోర్సు ప్రారంభిస్తుండగా, ఈడబ్ల్యూఎస్‌తో కలిపి బీఏ+బీఎడ్, బీఎస్సీ+బీఎడ్‌లో 110 సీట్లు ఉన్నట్లు చెప్పారు. వర్సిటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకొని ఆఫ్‌లైన్‌లో నేరుగా, రిజిస్టర్ పోస్టు ద్వారా అందజేయవచ్చునని అన్నారు. సీట్లు రిజర్వేషన్ వారీగా ఓసీ 50, ఎస్సీ 15, ఎస్టీ 6, బీసీఏ 7, బీసీ బీ 10, బీసీ సీ 1, బీసీ డీ7, బీసీఈ 4, ఈడబ్ల్యూఎస్ 10 శాతం ప్రవేశాల్లో రిజర్వేషన్ అమలవుతుందని చెప్పారు. రాష్ట్ర రిజర్వేషన్ పద్ధతిలో ఈ ప్రవేశాలు ఉంటాయని చెప్పారు. ఈ నెల 16న మెరిట్ లిస్ట్ ప్రదర్శిస్తామని అన్నారు.

ఆదిత్యుని హుండీ కానుకల లెక్కింపు రేపు
అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని స్థానిక అనివేటి మండపంలో శనివారం లెక్కించనున్నట్లు ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తెలియజేశారు. ఆలయ పాలకమండలి సభ్యులు, అధికారులు, అర్చకులు, గ్రామ పెద్దల సమక్షంలోనే హుండీలను తెరవనున్నామని, స్వచ్ఛంద సేవక ప్రతినిధులతో నగదు, స్త్రీలతో చిల్లర లెక్కించనున్నట్లు తెలిపారు.

'విద్య బలోపేతమే లక్ష్యం'


నిర్మాణంలో ఉన్న భవనాలు పరిశీలిస్తున్న ఆర్‌జీయూకేటీ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి

ఎచ్చెర్ల క్యాంపస్: విద్య బలోపేతమే లక్ష్యమని రాష్ట్ర రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) చాన్స్‌లర్ ప్రొఫెసర్ కేసీ రెడ్డి అన్నారు. ఎస్ఎంపురం ఆర్‌జీయూకేటీ క్యాంపస్‌ను గురువారం ఆయన సందర్శించారు. రూ. 3.60 కోట్లతో నిర్మిస్తున్న తరగతి గదులు, ల్యాబ్ భవనాలు, రూ. 2.62 కోట్లతో నిర్మిస్తున్న వసతి గృహం భవనాలు పరిశీలించారు. భవనాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, సకాలంలో పూర్తిచేయాలని చెప్పారు. విద్యార్థుల సంఖ్యకు తగ్గ వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. క్యాంపస్‌లో పూర్తిస్థాయి మౌలిక వసతులు లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని ఇడుపులపాయ, న్యూజివీడు, శ్రీకాకుళం, ప్రకాశం ఆర్‌జీయూకేటీ క్యాంపస్‌ల్లో రెగ్యులర్ బోధన సిబ్బంది నియామకానికి నోటిఫికేషన్ జారీ చేసినట్లు చెప్పారు. ఈ మేరకు మొత్తం నాలుగు క్యాంపస్‌లకు కలిపి 660 పోస్టులు నియామకం జరగుతుందని తెలిపారు. 58 ప్రొఫెసర్, 121 అసోసియేట్ ప్రొఫెసర్, 261 అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రీ యూనివర్సిటీ కోర్సు(పీయూసీ) బోధనకు సంబంధించి 220 లెక్చరర్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. రిక్రూట్‌మెంట్ నిబంధనల మేరకు నియామకాలు ఉంటాయని అన్నారు. రెగ్యులర్ సిబ్బంది నియామకంతో విద్య మరింత బలపడుతుందని చెప్పారు. పరిశోధన, నూతన ఆవిష్కరణలు లక్ష్యంగా విద్య ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా 250 కిలోవాట్స్ జనరేటర్ ప్రారంభించారు. కార్యక్రమంలో క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు, ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఎల్.సుధాకర్‌బాబు, అకడమిక్ డీన్ కె.మోహన్‌కృష్ణ, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఈఈ తమ్మిరెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

చిన్నారులకు టీచర్ల సాయం



చిన్నారుల వైద్యానికి ఆర్థిక సాయం చేస్తున్న డీఎస్సీ-2018 ఉపాధ్యాయుల బృందం

ఇచ్ఛాపురం రూరల్: బోన్‌మేరో వ్యాధితో బాధ పడుతున్న కవల పిల్లలు శివంగి హర్షవర్ధన్, హర్షితల శస్త్ర చికిత్సకు సాయం అందించాలంటూ సోమవారం సాక్షిలో ప్రచురితం అయిన 'చిన్ని ప్రాణాలకు ఆపద' కథనానికి 'డీఎస్సీ-2018 తెలుగు సేవాసమితి ఉపాధ్యాయులు' బృందం స్పందించింది. ఉపాధ్యాయ బృందం గురువారం కేశుపురం గ్రామానికి వెళ్లి చిన్నారుల వైద్యానికి కుటుంబ సభ్యులకు రూ.16,000 నగదుతో పాటు పండ్లు అందజేశారు. డొంకూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎస్.సరోజిని, సీవీఆర్, శంకరరెడ్డి, వెంకటేశ్వర రావు, స్వాతి, నూకయ్య, శ్రీహరి, లక్ష్మీ, గోవిందరావు, సువర్ణ, లోకనాథంలు చిన్నారులను పరామర్శించి నగదు అందజేసిన వారిలో ఉన్నారు.

ఏపీ ఈఏపీ సెట్ బైపీసీ స్ట్రీమ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ ఈఏపీసెట్-2023 బైపీసీ స్ట్రీమ్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను సాంకేతిక విద్యాశాఖ విడుదల చేసినట్లు శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, హెల్ప్‌లైన్ సెంటర్ సమన్వయకర్త గురుగుబెల్లి దామోదర్‌రావు తెలిపారు. కళాశాలలో గురువారం వివరాలు వెల్లడించారు. బైపీసీ స్ట్రీమ్‌లో బీటెక్ బయోటెక్నాలజీ, ఫుడ్ టెక్నాలజీ, బి.ఫార్మసీ, ఫార్మా డీ కోర్సుల్లో ప్రవేశాలు జరుగుతాయని చెప్పారు. ఈ నెల 14వరకు కౌన్సెలింగ్ కొనసాగుతుందని అన్నారు. ఈ నెల 8వ తేదీ లోపు ఆన్‌లైన్ ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్, ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు ఆన్‌లైన్ వెరిఫికేషన్, సర్టిఫికెట్ల అప్‌లోడ్, 11 నుంచి 13 వరకు ఆప్షన్ల ఎంపిక, 14న ఆప్షన్ల మార్పు ఉంటుందని అన్నారు. 17న అలాట్‌మెంట్ల ప్రకటన, 18 నుంచి 21 మధ్య సెల్ఫ్ రిపోర్టింగ్ కళాశాలలకు చేయవల్సి ఉంటుందని చెప్పారు. విద్యార్థులు పూర్తి వివరాలు, కౌన్సెలింగ్ కోసం హెచ్‌టీటీపీఎస్://సెట్స్.ఏపీఎస్‌సీహెచ్‌ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్ సైట్ లింక్ సంప్రదించాలని సూచించారు. పూర్తిస్థాయి ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ చేయాలని అన్నారు. ప్రత్యేక కేటగిరీ విద్యార్థులకు విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పరిశీలన ఉంటుందని చెప్పారు. దివ్యాంగులు, చిల్డ్రన్ ఆఫ్ ఆర్మ్‌డ్ పర్సన్, స్పోర్ట్సు అండ్ గేమ్స్, స్కౌట్ గైడ్, నేషనల్ క్యాడెట్ కాంప్స్, ఆంగ్లో ఇండియన్, ఈ నెల 10,11 తేదీ ల్లో ప్రత్యేక కేటగిరీల ధ్రువీకరణ పత్రాల పరిశీలన ఉంటుందని చెప్పారు. సెట్ అర్హత సాధించిన విద్యార్థులు కౌన్సెలింగ్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


ఆలయానికి వచ్చి వృద్ధురాలి మృతి



జాడ సూరమ్మ మృతదేహం

పాతపట్నం: సారవకోట మండలం బుడితి గ్రామానికి చెందిన వృద్ధురాలు జాడ సూరమ్మ(70) పాతపట్నం నీలమణిదుర్గ ఆలయానికి దర్శనానికి వచ్చి, ద్విచక్రవాహనం ఎక్కుతూ కాలు జారి వెనక్కి పడిపోవడంతో మృతి చెందినట్లు ఎస్ఐ మహమ్మద్ యాసిన్ తెలిపారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సారవకోట మండలం బుడితి గ్రామానికి చెందిన వృద్ధురాలు జాడ సూరమ్మ, తన కోడలు జాడ కుమారి, మనవడు జాడ సాయి రోహిత్‌తో కలిసి బుడితి నుంచి గురువారం ఉదయం పాతపట్నం నీలమణి దుర్గ ఆలయానికి వచ్చారు. దర్శనం అయిపోయాక మనవడు సాయిరోహిత్ నానమ్మను భోజనం కోసం స్నేహితుల బైక్‌పై పాతపట్నం తీసుకెళ్లాలని బయల్దేరాడు. అయితే సూరమ్మ బైక్ ఎక్కుతూ కాలు జారి వెనక్కి పడిపోయింది. తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు పాతపట్నం సీహెచ్‌సీ ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సూరమ్మ మృతి చెందింది. మృతదేహానికి శుక్రవారం ఉదయం పోస్టుమార్టం చేస్తామని ఎస్ఐ తెలిపారు. మృతురాలి కోడలు జాడ కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా దుర్యోధన



నియామక పత్రం అందుకుంటున్న దుర్యోధన

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జాతీయ బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం జిల్లా అధ్యక్షుడిగా పులారి దుర్యోధన నియమించినట్లు సంఘ అధ్యక్షులు పిట్ట చంద్రపతిరావు నియామక పత్రం అందించారు. నగరంలో ఎన్‌జీఓ హోమ్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్యోధన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా యువజన విభాగం మండల అధ్యక్షులను నియమించి సంఘం బలోపేతానికి కృషి చేస్తామన్నారు. తన మీదున్న నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానన్నారు.

విద్యార్థుల సామర్థ్యమెంత..?

- 3,6,9 తరగతుల విద్యార్థులకు సామర్థ్య నిర్ధారణ పరీక్షలు
- నేడు జిల్లావ్యాప్తంగా సీస్ సర్వే
- జిల్లాలో 1223 పాఠశాలలు ఎంపిక



పరీక్షకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థులు

ఇచ్ఛాపురం రూరల్, సారవకోట: అమ్మ ఒడి పేదలకు భరోసా ఇచ్చింది. ఇంగ్లిష్ మీడియం ప్రభుత్వ స్కూళ్లపై ఉన్న అభిప్రాయాలను చెరిపేసింది. నాడు-నేడు సర్కారు పాఠశాలల్లో సదుపాయాలు పెంచింది. ఇన్ని చర్యల తర్వాత పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలు ఏ మేరకు ఉన్నాయో తెలుసుకునేందుకు సర్కారు సన్నద్ధమవుతోంది. స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే(సీస్)ను శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 3,6,9 తరగతులు చదువుతున్న విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి ఈ సర్వే నిర్వహిస్తాయి. సర్వేకు సంబంధించి విద్యార్థులు ఇప్పటికే ప్రాక్టీసును ప్రారంభించారు. ఆయా మండల విద్యావనరుల కేంద్రాలకు పరీక్ష పేపర్లు కూడా చేరుకున్నాయి.

1332 మంది ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్ల నియామకం

'సీస్' సర్వే నిర్వహించేందుకు జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని 1223 పాఠశాలలను ఎంపిక చేసింది. విద్యార్థుల్లో అభ్యసన ఫలితాలు (లెర్నింగ్ అవుట్ కమ్స్) ఏ విధంగా ఉన్నాయో తెలుసుకునేందుకు నిర్వహించే సర్వేకు ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లను (ఎఫ్ఎస్ఐ) నియమించారు. ప్రభుత్వ, ప్రైవేటు, డిగ్రీ, ఇంజినీరింగ్, డైట్ కళాశాల విద్యార్థులు 1332 మందిని జిల్లా విద్యాశాఖ ఎఫ్ఎస్ఐలుగా నియమించింది. వీరికి ఇప్పటికే డివిజన్ స్థాయిలో శిక్షణ సైతం ఇచ్చారు. జిల్లా విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో జరగనున్న పరీక్షలను డీసీఈబీ సెక్రటరీ, లెక్చరర్, డీఈఓ కార్యాలయ ప్రతినిధి, ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ పరిశీలిస్తారు. మండల స్థాయిలో ఎంఈఓ-1, ఎంఈఓ-2లతో పాటుగా స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలు 64 మంది సర్వే నిర్వహణను పర్యవేక్షిస్తారు.

ఓఎంఆర్ విధానంలో

'సీస్' సర్వేలో భాగంగా 3, 6, 9 తరగతుల విద్యార్థులకు ఇప్పటికే మోడల్ పరీక్షలు నిర్వహించారు. పరీక్ష ఓఎంఆర్ విధానంగా ఉంటుంది. 3,6 తరగతుల విద్యార్థులకు ప్రధానంగా ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీపై పరీక్ష ఉంటుంది. 9వ తరగతికి తెలుగు, ఇంగ్లిష్, గణితం, సోషల్, సైన్స్ సబ్జెక్ట్‌లపై పరీక్ష నిర్వహిస్తారు.

ముఖ్యాంశాలు

6, 9 తరగతి విద్యార్థులకు గత సంవత్సరం సిలబస్‌పై పరీక్ష నిర్వహిస్తారు. జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన 1223 పాఠశాలల్లో 31167 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఉదయం 10.30 గంటలకు పరీక్షలు ప్రారంభమయ్యే పరీక్షల్లో 3వ తరగతి విద్యార్థులకు 60 నిమిషాలు, 6వ తరగతి విద్యార్థులకు 75 నిమిషాలు, 9వ తరగతి విద్యార్థులకు 90 నిమిషాలు సమయాన్ని కేటాయిస్తారు.

జాతీయ స్థాయిలో ర్యాంకులు



స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే(సీస్) పరీక్షలో వచ్చిన ఫలితాలు ఆధారంగా విద్యార్థులకు జాతీయ స్థాయిలో ర్యాంకులను కేటాయించనున్నారు. సీస్ పరీక్ష ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై ఫోకస్ పెట్టనున్నాం. ఫలితాలు ఆధారంగా తగిన తర్ఫీదు ఇవ్వడం జరుగుతుంది. నేడు జరగబోయే పరీక్ష నిర్వహణకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.

– కె.వెంకటేశ్వరరావు, జిల్లా విద్యాశాఖాధికారి, శ్రీకాకుళం

వేసవికి పక్కాగా పవర్



లావేరులో పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ కృష్ణమూర్తి తదితరులు

అరసవల్లి: వేసవిలో విద్యుత్ సమస్యలను అధిగమించడానికి ప్రభుత్వం ఇప్పటి నుంచే చర్యలు ప్రారంభించింది. సర్కిల్ ఎస్ఈ ఎస్.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అధికారుల బృందం జిల్లాలో విద్యుత్ అవసరాలకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదించగా.. ఈ క్రమంలో రూ.1.20 కోట్లతో లావేరులోనూ, మరో రూ.1.20 కోట్లతో కేశవరావుపాలెంలోనూ 5 ఎంవీఏ (మెగా ఓల్ట్ యాంపియర్) సామర్థ్యం గల పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. ఈ మేరకు గురువారం లావేరులో పీటీఆర్ ఏర్పాటు పనులను స్వయంగా ఎస్ఈ కృష్ణమూర్తి పరిశీలించారు. సంబంధిత ఈఈ బయ్యన్నాయుడు, రాజశేఖరం, డిప్యూటీ ఈఈలు రమణమూర్తి, పైడి యోగేశ్వరరావు, చల్లా వెంకటేశ్వరరావులతో పాటు కాంట్రాక్టర్ ఉంగటి పాపారావుతో పనుల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వేగంగా పనులు పూర్తి చేయడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ క్రమంలో మరో రెండ్రోజుల్లో కేశవరావుపాలెంలో పనులు కూడా పూర్తి చేయనున్నట్లుగా ప్రకటించారు. అతి త్వరలో గార మండలం చల్లపేట, రణస్థలం సమీపంలో పిసినిలో కూడా మరో రెండు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని ఎస్ఈ కృష్ణమూర్తి తెలియజేశారు.

వేసవి కష్టాలే లేకుండా

జిల్లాకు ఏటా విద్యుత్ డిమాండ్ క్రమేణా పెరుగుతూ వస్తోంది. వ్యవసాయ విద్యుత్‌తో పాటు విపరీతంగా ఏసీల వినియోగం పెరగడంతో విద్యుత్ డిమాండ్‌కు మించి వినియోగం నమోదవుతోంది. అయితే సబ్‌స్టేషన్ల వరకు 33 కేవీ విద్యుత్ సరిపడా ఉంటున్నా.. 11కేవీ పవర్‌గా కన్వర్ట్ కావడంలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల పాత్ర కీలకం కావడంతో తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో అవసరమైన మేర విద్యుత్ సరఫరాకు అన్ని రకాల చర్యలు చేపట్టనున్నారు. ఈ క్రమంలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాట్లు వేసవికి ముందే చేయడంలో అధికారులు సఫలయ్యారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా గత ఏడాది జిల్లాలో ఏ ప్రాంతాల్లో 60 శాతానికి పైగా విద్యుత్ డిమాండ్ తలెత్తిందో..అలాంటి ప్రాంతాల్లో తక్షణమే పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇవే కాకుండా జిల్లా కేంద్రంలో త్వరలో పొన్నాడ బ్రిడ్జి వద్ద 132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు కానుండడంతో జిల్లా కేంద్రానికి విద్యుత్ అవసరాలు దాదాపుగా తీరిపోతాయి. నగరంలో పీఎన్ కాలనీ, విశాఖ-ఎ కాలనీల్లో కూడా సబ్‌స్టేషన్ల నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి.

వైద్య విధాన్ పరిషత్‌లో 3 ఉద్యోగాలకు నోటిఫికేషన్

అరసవల్లి: జిల్లాలో వైద్య విధాన్ పరిషత్ ఆస్పత్రుల్లో కాంట్రాక్ట్ విధానంలో ల్యాబ్ టెక్నీషియన్లు -2, ఔట్‌సోర్సింగ్ విధానంలో ల్యాబ్ అటెండెంట్-1 పోస్టులను రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాప్తికి భర్తీ చేయనున్నట్లుగా డీసీహెచ్‌ఎస్ డాక్టర్ భాస్కరరావు ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 6వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా దరఖాస్తుల స్వీకరణకు గడువుగా నిర్ణయించినట్లు, మరిన్ని వివరాలకు శ్రీకాకుళం.ఎపి.జీవోవి.ఇన్ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

డీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతల స్వీకరణ

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళం డీసీసీ అధ్యక్షుడిగా డాక్టర్ పేడాడ పరమేశ్వరరావు పూర్తిస్థాయి బాధ్యతలను చేపట్టారు. శ్రీకాకుళంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో రాష్ట్ర పీసీసీ ఉపాధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి గురువారం డీసీసీ అధ్యక్ష బాధ్యతలను, రికార్డులను పేడాడ పరమేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా పేడాడ పరమేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో అనేక సమస్యలు ఎదుర్కొంటున్న బడుగు బలహీనర్గాల గొంతుగా పార్టీ శ్రేణులు వ్యవహరించాలని పిలుపునిచ్చారు.

ద్విచక్ర వాహనాల చోరీ నిందితుడు అరెస్టు



చోరీ చేసిన వ్యక్తి, బైక్‌లను చూపిస్తున్న పోలీసులు

పర్లాకిమిడి: స్థానిక రైల్వేస్టేషన్‌లో కొన్ని రోజులుగా మాయమవుతున్న ద్విచక్ర వాహనాల మిస్టరీని ఆదర్శ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఇన్‌చార్జి ప్రశాంత భూపతి ఎట్టకేలకు ఛేదించారు. కేసుకు సంబంధించి శ్రీకాకుళం జిల్లా టెక్కలి గ్రామానికి చెందిన హరిశ్చంద్ర బెహరాను అరెస్టు చేసి మూడు ద్విచక్ర వాహనాలు, నకిలీ తాళాలు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గత నెల 28వ తేదీన గుసాని సమితి అమర గ్రామానికి చెందిన రైపల్లి నర్సింహ అనే వ్యక్తి రైల్వేస్టేషన్‌లోని పార్కింగ్ స్టాండ్‌లో తన ద్విచక్ర వాహనాన్ని ఉంచాడు. అనంతరం తన కుటుంబ సభ్యులను ట్రైన్ ఎక్కించి వచ్చి చూడగా బైక్ కనిపించలేదు. వెంటనే స్థానిక ఆదర్శ పోలీసుస్టేషన్‌లో ప్రాథమిక సమాచారంతో ఫిర్యాదు చేశాడు. ఐఐసీ ప్రశాంత భూపతి కేసును దర్యాప్తు చేసి ఎట్టకేలకు నిందితుడిని అరెస్టు చేశారు. ఆయనపై పలు సెక్షన్లతో కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.

తప్పిన పెను ప్రమాదం



చెరువు గట్టుపై తొమ్మిది మందితో బోల్తాపడిన ఆటో



గాయపడిన సాయిశిరీషా పాఠశాల విద్యార్థిని హేమకుమారి

నందిగాం/కాశీబుగ్గ: నందిగాం మండలం పెద్దబాణాపురం గ్రామం వద్ద గురువారం స్కూలు పిల్లలకు పెద్ద ప్రమాదం తప్పింది. పెద్దబాణాపురం గ్రామం నుంచి ఆరుగురు విద్యార్థులతో జాతీయ రహదారిపైకి వచ్చిన ఆటో కొత్తగ్రహారం వద్ద మరో ఇద్దరిని ఎక్కించుకుని పెద్ద బాణాపురం పెద్ద చెరువు సమీపానికి వచ్చే సరికి మహేంద్ర సుప్రో వాహనాన్ని తప్పించబోయి బోల్తా పడింది. అప్పటికే ఆటో వెనుక ఓ ఆయిల్ ట్యాంకర్ వస్తోంది. అదృష్టవశాత్తు ఆటో రోడ్డు మధ్యకు వెళ్లకుండా పక్కగుండా బోల్తా పడడంతో విద్యార్థులకు పెను ప్రమాదం తప్పింది. దీనిపై నందిగాం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆటోలో ఉన్న విద్యార్థులకు అక్కడ ఉన్న వారు బయటకు తీసి జాతీయ రహదారి అంబులెన్స్‌లో పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చినబడం సాయిశిరీషా పాఠశాలకు చెందిన హేమకుమారికి ఎడమకాలు విరిగింది. సూర్యతేజ జూనియర్ కళాశాలకు చెందిన హారికకు కూడా పెద్ద దెబ్బలే తగిలాయి. ఆటోడ్రైవర్ గుండెకు స్టీరింగ్ తగలడంతో శ్వాసతీసుకోవడం ఇబ్బందిగా మారడంతో వీరందరికి వైద్య సేవలు అందిస్తున్నారు. పలాస ఎంఈఓ శ్రీనివాసరావుతో పాటు ఆయా పాఠశాలల యాజమాన్యం వచ్చి విద్యార్థులను పరామర్శించారు.

ఇంటర్ పరీక్ష ఫీజులకు వేళాయె

- ఇంటర్మీడియెట్ పరీక్ష ఫీజుల చెల్లింపునకు షెడ్యూల్ విడుదల
- నవంబర్ 30లోగా ఫైన్ లేకుండా చెల్లింపునకు అవకాశం



ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లా ఆర్ఐఓ కార్యాలయం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ పరీక్ష ఫీజుల చెల్లింపునకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. నవంబర్ 30వ తేదీలోగా ఆలస్య రుసుం లేకుండా పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. రెగ్యులర్ విద్యార్థులతోపాటు గతంలో ఉత్తీర్ణులుకాని విద్యార్థులు, ప్రైవేటు విద్యార్థులు, గ్రూపు ఛేంజ్ అయిన విద్యార్థులు కూడా పరీక్షలకు హాజరయ్యేందుకు ఫీజులను చెల్లించవచ్చు.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో అన్ని యాజమాన్యాల పరిధిలో జూనియర్ కళాశాలలు 191 ఉన్నాయి. అయితే వీటిలో ఫంక్షనింగ్ జరుగుతున్న కళాశాలలు 168 ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 38, సోషల్ వెల్ఫేర్ 9, ట్రైబల్ వెల్ఫేర్ 1, మోడల్ స్కూల్/కళాశాలలు 13, కేజీబీవీలు 25, జెడ్పీహెచ్‌స్కూల్ కాలేజీలు 5, కోపరేటివ్ 2, ప్రైవేటు కళాశాలలు 75 ఉన్నాయి. వీటిల్లో 45410 మంది చదువుతున్నారు. వీరంతా ఇప్పుడు పరీక్ష ఫీజులు చెల్లించనున్నారు. వీరితో పాటు గతంలో ఫెయిలైన సుమారు 8వేల మంది పరీక్ష ఫీజులను చెల్లించనున్నారు.


ఈ నెలాఖరు వరకు ఫీజుల చెల్లింపులు..

ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల పరీక్ష ఫీజును ఎలాంటి ఫైన్ లేకుండా ఈనెలాఖరు వరకు చెల్లించవచ్చు. ఇందులో ఎలాంటి గడువు పెంపు ఉండదని బోర్డు స్పష్టం చేసింది. రూ.1000 ఆలస్యంతో డిసెంబర్ 1 నుంచి 15 తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించే వెసులుబాటు ఉంది. పేద, సామాన్య విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ ఏడాది కూడా ప్రభుత్వం పరీక్ష ఫీజులను పెంచలేదు. పరీక్ష ఫీజులను యథాతథంగా ఉంచింది.

పరీక్ష ఫీజు ఎంత చెల్లించాలంటే..?

ప్రస్తుత విద్యా సంవత్సరానికి చెందిన రెగ్యులర్ విద్యార్థుల పరీక్ష ఫీజులను నిర్ణయించారు. జనరల్/ఒకేషనల్ స్టూడెంట్లు తమ పరీక్ష ఫీజు రూ. 550 చెల్లించాల్సి ఉంటుంది. అలాగే సెకెండియర్ సైన్స్ విద్యార్థుల ప్రాక్టికల్ పరీక్ష ఫీజు అదనంగా మరో రూ.250 చెల్లించాల్సి ఉంటుంది. అనగా సైన్స్ విద్యార్థులు ప్రాక్టికల్ ఫీజుతో కలిపి రూ.800 చెల్లించాలి. బ్రిడ్జి కోర్సులకు రూ.150 అదనంగా చెల్లించాలి. ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్ష పేపర్లకు రూ.1100 చెల్లించాల్సి ఉంటుంది. విద్యార్థుల నుంచి నిర్దేశించిన మేరకే ఫీజులను వసూలు చేయాలని, అధిక ఫీజులను వసూలు చేస్తే చర్యలు తీసుకోక తప్పదని ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లా అధికారులు హెచ్చరిస్తున్నారు. మరిన్ని వివరాలకు బీఐఈ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌పోర్టల్‌ను సందర్శించవచ్చు.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు..



నిర్దేశిత గడువులోగా పరీక్ష ఫీజులు విద్యార్థులు చెల్లించేలా ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు చొరవ తీసుకోవాలి. ఎలాంటి ఆలస్య లేకుండా ఈనెల 30వ తేదీ వరకు చెల్లించవచ్చు. సకాలంలో ఫీజులు వసూలయ్యేలా చూడాలి. అధికంగా ఫీజులు వసూలు చేసినట్టుగా ఫిర్యాదులు వస్తే మాత్రం కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. విద్యార్థుల డేటాను ఆన్‌లైన్‌లో తప్పులు, దోషాలు లేకుండా ఉండేలా చూడాలి.

– పి.దుర్గారావు, జిల్లా ఆర్ఐఓ, ఇంటర్మీడియెట్ బోర్డు

హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి సాయం



కానిస్టేబుల్ సతీమణికి చెక్కు అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్: ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎం.లక్ష్మీనారాయణ కుటుంబానికి ఎస్పీ జీఆర్ రాధిక నగదు చెక్కును అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఆయన సతీమణి ఎం.జ్యోతి, కుటుంబ సభ్యులను ఎస్పీ రాధిక పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ప్రభుత్వం ద్వారా మంజూరైన అడిషనల్ విడో, ఫ్లాగ్ ఫండ్ రూపంలో రూ. 75 వేల నగదు చెక్కును ఎస్పీ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పోలీసు శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రావాల్సిన మిగిలిన ప్రయోజనాలు సకాలంలో అందేటట్లు చర్యలు తీసుకోవాలని కార్యాలయ సిబ్బందికి ఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ జె.తిప్పేస్వామి, పరిపాలనాధికారి సీహెచ్ గోపినాథ్, ఆర్ఐ డి.సురేష్, వై.లిల్లీభాయ్ పాల్గొన్నారు.

'ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తాం'



ధర్మపురంలో కుళాయిల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

పొందూరు: నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తానని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని ధర్మపురం, పిల్లలవలస గ్రామాల్లో జలజీవన్ మిషన్ నిధులు రూ.1.76 కోట్లతో ఇంటింటికీ తాగునీటి కుళాయిల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పిల్లలవలసలో రూ. 71 లక్షలు, ధర్మపురంలో రూ. 1.5 కోట్లతో శంకుస్థాపనలు చేశారు. ప్రతి గ్రామంలో మౌలిక వసతులు కల్పన జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, మండల పార్టీ కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు కొంచాడ రమణమూర్తి, ఏఎంసీ చైర్మన్ బాడాన సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఆసరా బ్రోచర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు, జిఎస్ఎం అనీల్‌రాజు తదితరులు

కాశీబుగ్గ: న్యూఢిల్లీలో ఈ నెల 24న తేదీన అడ్వకేట్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్‌నెస్ (ఆసరా) కార్యక్రమం జరగనుండగా రాష్ట్ర పశుసంవర్ధక పాడి పరిశ్రమల మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆసరా పోస్టర్ ఆవిష్కరించారు. ఆసరా జిల్లా కార్యదర్శి, పలాస బార్ అసోసియేషన్ కార్యదర్శి జీఎస్ఎం అనీల్‌రాజు నేతృత్వంలో మంత్రి స్వగృహంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, 14వ వార్డు కౌన్సిలర్ సనపల సింహాచలం, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు రోణంకి శ్రీనివాసరావుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 7వ వార్డు చినబడం గ్రామానికి చెందిన బొంగి నారాయణ అనే రైతు పొలంలో పాము కాటుకు గురై పలాస ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వార్డు వలంటీర్ నెయ్యిల నీలవేణి ఆ ఆస్పత్రికి నేరుగా వెళ్లి ఆయనకు గురువారం పింఛన్ అందించారు.

– కాశీబుగ్గ

'ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి'

జి.సిగడాం: రాష్ట్రంలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, విన్నపాలను సీఎం వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లామని ఆంధ్రప్రదేశ్ జేఏసీ ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరావు అన్నారు. ఆయన గురువారం ఎందువ గ్రామంలో ఆర్టీసీ కండక్టర్ కింజరాపు జగన్‌మోహన్‌ను పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ వివిధ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వం ప్రకటించిన డీఏలు మంజూరు చేయాలన్నారు. విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు చెల్లించాలని కోరారు.

రైలు ప్రమాదంలో విద్యార్థి మృతి



చిరంజీవి

ఇచ్ఛాపురం: పురుషోత్తపురం రైల్వే ఎల్‌సీ గేట్ వద్ద గురువారం జరిగిన రైలు ప్రమాదంలో మండలంలోని ముచ్చింద్ర గ్రామానికి చెందిన సాడి చిరంజీవి(17) అనే విద్యార్థి మృతి చెందాడు. చిరంజీవి పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. విద్యార్థి మృతితో ముచ్చింద్ర గ్రామంతో పాటు ఆదర్శపాఠశాలలో విషాద ఛాయలు అలముకున్నాయి.